

● ధర్మారం (బి)లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు

రాజకీయ చైతన్యం కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్

- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు
- ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ధర్మారం(బి)లో కాంస్య విగ్రహ ఆవిష్కరణ
- ఘన నివాళులర్పించి అన్నదానం చేసిన ఎన్టీఆర్ అభిమానులు



డిచ్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించిన మహోన్నత వ్యక్తి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు అని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం ధర్మారం (బి) గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ప్రారంభ కార్యక్రమంలో మండవ ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహానికి గజమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మండవ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీని ప్రారంభించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన ఘనత ఎన్టీరామారావుకే దక్కిందన్నారు. సినిమా, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ దురంధరుడు అని, తెలుగుచలన చిత్రాల్లో రాముడు, భీముడు అవతారాల్లో ప్రజల్లో గుర్తుండిపోయిన వ్యక్తి అని కొనియాడారు. పట్వారీ వ్యవస్థను రద్దు చేసి గ్రామీణ ప్రజలకు స్వేచ్ఛ కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్ తనదైన ముద్ర వేసుకున్నారని, విశ్వవ్యాప్తంగా తెలుగు జాతికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని మండవ కొనియాడారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు మండవ వెంకటేశ్వరరావును శాలువతో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని మండవ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆజార్ కిషన్ రావు, మండవ సతీమణి మండవ నళిని, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు యాదగౌడ్, పార్టీ ప్రతినిధులు బాగిర్తి బాగారెడ్డి, అనంత్ రెడ్డి, రామాగౌడ్, కలగర నాని, కలగర శ్రీనివాస్, రావుల బ్రహ్మానందం, నాయుడు అంజనేయులు, పిచ్చేశ్వరరావు, పున్నారావు, మురారీ, నాగేశ్వరరావు, హన్మండ్లు, శ్యాంరావు, వసంత్‌రావు, గోపాలం విద్యాసాగర్ రావు, నాగర్జున, రామకృష్ణ, పద్మారావు, సాయిబాబా, రాజా, ననేశ్, కస్తూరి, ఉమా, ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధిక వడ్డీ పేరిట మోసం చేసిన కంపెనీ నిర్వాహకుడి అరెస్టు

- మెడిలైఫ్ మల్టీలెవల్ మనీ నెట్‌వర్కింగ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌పై కేసు



- తమిళనాడు కేంద్రంగా మెడిలైఫ్ అక్రమ దందా
- జిల్లాలో 400 మంది నుంచి సుమారు రూ.3కోట్లకు పైగా డిపాజిట్ల సేకరణ
- వివరాలు వెల్లడించిన నిజామాబాద్ ఏసీపీ

ఖిల్లా, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పెట్టిన పెట్టుబడికి అధిక వడ్డీ ఇస్తామని నమ్మించి లక్షల్లో ప్రజలను మోసం చేసిన మెడిలైఫ్ మల్టీ లెవల్ మనీ నెట్‌వర్కింగ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 400 మంది నుంచి సుమారు రూ.3కోట్లకు పైగా అక్రమంగా డిపాజిట్లు సేకరించినట్లు విచారణలో తేలిందన్నారు. తమిళనాడుకు చెందిన మెడిలైఫ్ కంపెనీ సంస్థ చేపట్టిన వ్యాపారం చట్టవిరుద్ధమైనదని డిపాజిట్‌ల సేకరణ, అధిక వడ్డీ, కమీషన్‌ల పేరుతో జరుగుతున్న గొలుసు విధానం వ్యాపారంపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి నేతృత్వంలో నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజు, నాల్గవ టౌన్ ఎస్సై శ్రీకాంత్‌లు ఆ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రవిచంద్రన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజ్‌కుమార్‌లపై అక్రమ మనీ సర్క్యులేషన్ చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఏసీపీ తెలిపారు. జిల్లాలో మెడిలైఫ్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌గా సాగర్ ద్వారా 400మంది నుంచి సుమారు రూ.3కోట్లు డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. అమాయకుల నుంచి రూ.10వేలు డిపాజిట్ చేయాలని ఆ డిపాజిట్‌పై లబ్ధిదారులకు మొదటి వారం 4శాతం కమీషన్ చొప్పున 52 వారాలు పూర్తిగా ఇస్తామని చెప్పి గొలుసు విధానం స్కీమ్‌లో మెంబర్లుగా చేర్పించినట్లు తెలిపారు. 2024 ఆగస్టు వరకు ఇచ్చి ఆ తర్వాత నిబంధనలు ఒప్పుకోవడం లేదని పాత సభ్యుల యొక్క డిపాజిట్లపై ఉండే కొత్తగా వచ్చే డిపాజిట్లపైన మినిమం లక్షా డిపాజిట్ చేయాలని కొత్త డిమాండ్ తెచ్చినట్లు చెప్పారు. ఆ డిపాజిట్లపై అక్టోబరు 2024 నుంచి నెలకు 5 శాతం చొప్పున కమీషన్, వడ్డీ ఇస్తూ సభ్యులు ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఆ డబ్బును విత్‌డ్రా చేయాలనుకుంటే డిపాజిట్ చేసిన పూర్తి డబ్బులు ఇవ్వడం జరుగుతుందని చెప్పి నమ్మించారని అన్నారు. అందులో సభ్యులు తమ కింద ఆరుగురిని సభ్యులుగా చేర్పిస్తే వారు కూడా తమ కింద ఇలా 14 లెవెల్స్‌లో ఇంకా కొంత మందిని డిపాజిట్ చేయిస్తే కమీషన్, గోల్డ్, సిల్వర్ కాయిన్, బైకులు గిఫ్టులు ఇస్తామని ఆశచూపి జిల్లాలో అమాయక ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని ఏసీపీ తెలిపారు.

నగర పాలక సంస్థ చివరి సమావేశం..

రసాభాస!





● సమావేశానికి హాజరైన నగర కార్పొరేటర్లు

- చర్చ లేకుండానే అంశాల ఆమోదం
- వీధి వ్యాపారుల కోసం మేయర్ ఛాంబర్ ఎదుట ఎంఐఎం నిరసన
- ఇందిరమ్మ కమిటీలో కాంగ్రెస్ నాయకులను చేర్చడంపై బీజేపీ కార్పొరేటర్ల ఆందోళన
- ఒక్క అంశంపై కూడా చర్చ జరగకుండానే 39 అంశాల ఆమోదం
- నిరసనలతో ముగిసిన చివరి కౌన్సిల్ సమావేశం

సుభాష్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కౌన్సిల్ చివరి సమావేశం రసాభాసగా ముగిసింది. కార్పొరేటర్లకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. చివరి సమావేశంలోనైనా నగర సమస్యలపై గొంతెత్తుదామనుకున్న కార్పొరేటర్లకు నిరాశనే మిగిలింది. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం నగర మేయర్ దండు నీతూకిరణ్ అధ్యక్షతన చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఉదయం 11గంటల సమయంలో మేయర్ సమావేశ మందిరంలో కూర్చొని అంశాలను చదివి వినిపించారు. అదే సమయంలో ఎంఐఎం సభ్యులు వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని, రోడ పై వీధి వ్యాపారాలు చేసుకునేలా చట్టం తేవాలని నిరసన వ్యక్తం చేశారు. సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. ఛాంబర్ ఎదుట ఆందోళన చేశారు. సమావేశం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగగా ఏ ఒక్క అంశంపై చర్చ జరగలేదు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమావేశానికి హాజరైనా ఫలితం లేకుండా పోయింది. సమావేశంలో తన గొంతును వినిపించలేకపోయాడు. సభను సజావుగా సాగించేందుకు ఏ పార్టీ కూడా సహకరించలేదు. ఎలాంటి తీర్మానాలు చేయకుండానే సమావేశం ముగించడం పట్ల బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశం మొత్తం పోలీసు బందోబస్తు మధ్య ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, సభ్యుల మద్దతుతో 39 అంశాలపై ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. ఐదేళ్ల కాలం సహకరించిన ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎంఐఎం కార్పొరేటర్ల నిరసన...

వీధి వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని ఎంఐఎం కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. ఎంఐఎం కార్పొరేటర్లు మేయర్ పోడియం వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. మేయర్ అంశాలపై చర్చిద్దామని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో మేయర్ సమావేశ మందిరం నుంచి ఛాంబర్‌లోకి వెళ్లిపోయింది. దీంతో ఎంఐఎం కార్పొరేటర్లు మేయర్ ఛాంబర్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సుమారు గంట సేపు మేయర్ ఛాంబర్ ఎదుట బైఠాయించారు. నగరంలో ఫుట్‌పాత్‌లపై పొట్టకూటి కోసం వీధి వ్యాపారాలు చేసుకుంటే అడ్డుకోవడం ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. ఫుట్‌పాత్‌లు కబ్జా చేసి ధర్నాలు నిర్వహిస్తుంటే పట్టించుకోని మున్సిపల్ అధికారులు పోలీసులలు వీధి వ్యాపారులపై అధికా రాన్ని ప్రదర్శిస్తున్నారని అన్నారు. వీధి వ్యాపారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మేయర్ ఎంఐఎం సభ్యులను పిలుచుకొని సముదాయించగానే సమావేశానికి తిరిగి హాజరయ్యారు.

బీజేపీ కార్పొరేటర్ల నిరసన..

ఇందిరమ్మ కమిటీలలో కాంగ్రెస్ నాయకులను చేర్చడంపై బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ ఎదుట నేలపై కూర్చొని ధర్నా నిర్వహించారు. స్థానికేతరులు కాని కాంగ్రెస్ నాయకులను కమిటీలో చేర్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వివిధ అంశాలపై చర్చించకుండానే తమ సభ ఆమోదం తెలిపిందని దీంతో ప్రజాసమస్యలు చర్చలు రాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి వ్యాపారులకు బీజేపీ వ్యతిరేకం కాదని వీధి వ్యాపారుల కోసం నగరంలో కోట్ల రూపాయలతో మార్కెట్‌లను నిర్మించామని వీధి వ్యాపారులు మార్కెట్‌లలో వ్యాపారం చేసుకోవాలని అన్నారు. నూతనంగా నిర్మించిన మార్కెట్‌లలో వ్యాపారం చేయకపోవడంతో కోట్ల రూపాయలతో నిర్మించిన నిర్మాణాలు వృథాగా పడి ఉన్నాయని అన్నారు. తిరిగి పది రోజుల అనంతరం సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు మేయర్ ఛాంబర్ వద్ద నిరసన వ్యక్తం చేసిన బీజేపీ సభ్యులను మేయర్ పిలిపించుకొని మాట్లాడారు. మరో మారు సభ నిర్వహించేందుకు కమిషనర్‌తో కలిసి చర్చిస్తానని తెలిపారు.



కౌన్సిల్ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు



మేయర్ ఛాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎంఐఎం కార్పొరేటర్లు



సింగపూర్ పర్యటనలో సీఎంతో పాటు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

సీఎం సింగపూర్ పర్యటనలో పోచారం

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. శనివారం తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగపూర్ గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కందూరు జయవీర్, హైదరాబాద్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రోహిన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్చరల్ సొసైటీ సింగపూర్ అధ్యక్షుడు గడప రమేష్‌బాబు, సొసైటీ కార్యవర్గం పాల్గొన్నారు.

నేడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి
- నగరంలో మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ సభ

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులపై నిర్వహించే సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో భరోసా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. నగరంలో వరద నీటి కాలువ, అమృత్‌పథకం తదితర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.380 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే ప్రెస్‌క్లబ్ పక్కనగల గ్రౌండ్‌లో మధ్యాహ్నం 2గంటలకు నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నగర అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు కోరారు.

పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ అంకిత్



బోధన్‌లో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్

బోధన్‌రూరల్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందించనున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల కోసం నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా అర్హుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని పలు వార్డులల్లో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. పట్టణంలోని పలు కాలనీల్లో ప్రభుత్వ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారి పూర్తి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా అధికారులు సర్వేలో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని ప్రతీ పేదవాడికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు కూడా నిరుపేదలు, అర్హులైన వారందరికీ అందేలా అధికారులు సమగ్రంగా సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పక్కాగా చేపట్టాలి..

ఎడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల అభ్ధిదారుల ఎంపికకు చేపట్టిన సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో చేపట్టిన రేషన్ కార్డు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం తీసుకు వచ్చిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఎలాంటి తప్పిదాలు ఉండకూడదని ఆయన అన్నారు. సమగ్రంగ సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

పెద్దాస్పత్రిలో రోగుల కష్టాలు!

- కరెంటు లేక ఎక్స్‌రే, సిటీ స్కానింగ్ కోసం గంటల తరబడి ఎదురు చూపులు 7

పొలాల్లో విద్యుత్ సమస్య లేకుండా చూడాలి

● జిల్లా ట్రాన్స్‌కో డీఈ టెక్నికల్ రమేష్


జాన్కంపేట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ట్రాన్స్‌కో డీఈ

వేల్పూర్, జనవరి18(ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్ నుంచి వ్యవసాయ పంట పొలాల్లోకి సరఫరా చేస్తున్న విద్యుత్‌లో ఏటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త పడాలని జిల్లా ట్రాన్స్‌కో డీఈ టెక్నికల్ రమేష్ ట్రాన్స్‌కో సిబ్బందికి సూచించారు. శనివారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో పొలంబాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ పనితీరును పరిశీలించారు. అనంతరం వ్యవసాయ పంట పొలాల్లో వెళ్లే విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలని, ఎక్కడ కూడా లూజ్ వైర్లు ఉండకుండా జాగ్రత్త పడాలని, అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాలను రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో భీమ్‌గల్ ఏడీ వినోద్, ఏఈ యశ్వంత్‌రావు, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


అక్లూర్‌లో చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, జనవరి18(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శని వారం గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు మల్లారెడ్డి, సీనియర్ నా యకులు పద్మరావులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయని వారన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాంబయ్య, శేఖర్, అశోక్, చిన్న వెంకటి, నర్సయ్యసాయన్న,శివకృష్ణఅరుణ్, నరేష్‌అప్జర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం బీజేపీ ఓబీసీ మోర్చ కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీకి కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో నాయకులు రమేష్, రవిశంకర్ గౌడ్, జంపాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడి పల్లి 24వార్డులో శనివారం స్థానిక కౌన్సిలర్ ఆకుల రాము పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈసందర్భంగా లబ్ధిదా రులు సీఎం,నియోజకవర్గఇన్‌చార్జీ వినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరి అయిన చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునిల్ కుమార్‌కు లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, గడ్డం జీవన్, రాజారెడ్డి, ప్రసాద్, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన ఆరుగురు బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మండల కాంగ్రెస్ నాయకులు బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ ప్రసాద్, బుచ్చి మల్లయ్య, ప్రదీప్, సింగిరెడ్డి శేఖర్, సాయి అజారొద్దీన్,దూలూరు కిషన్ వేముల గంగారెడ్డి,గంగారాం, జగదీశ్ నాగరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌లో అంతరాయం లేకుండా మరమ్మతులు

ఆర్మూర్‌టౌన్, జనవరి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్ నగర్‌లో 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుల్‌లో అంతరాయం కలుగకుండా మరమ్మతులు చేపట్టారు. పట్టణానికి చెందిన విద్యుత్ సరఫరాలో ప్రతీ మూడో శనివారం మెంటెనెన్స్ కారణంగా కొన్ని గంటలు అంతరాయం కలుగుతుందని, ఇక నుంచి అలాంటి అంతరాయం ఉండదని విద్యుత్ డీఈ రాజేశ్వర్‌రావు, ఏడీఈలు కృష్ణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ఆశ్రితరెడ్డి, మనిషా, లైన్‌మెన్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఏర్గట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక సర్వేను శనివారం ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, వివరాలను సరిగ్గా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో వెంకటేశ్వర్లు, ఎంపివో శివచరణ్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని జరుగుతున్న రేషన్‌కార్డు సర్వేను మున్సిపల్ కమిషర్ రాజు పరిశీలించారు. శనివారం మున్సిపల్ పరిధిలో 1, 2, 35వార్డులలో ఆయన పర్యటించి అవకతవకలకు, పొరపాట్లకు తావులేకుండా అర్హుల ఎంపికను జాగ్రత్తగా చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ శేఖర్, దత్తారెడ్డి, వార్డు ఆఫీసర్‌లు, పాల్గొన్నారు.

పాఠశాల భవనం నిర్మించాలని ధర్నా

కోటగిరి,జనవరి18(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల భవనం నిర్మించాలని నాయకులు డిమాండ్ చేశారు. పొతంగల్ బస్టాండ్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని మౌలాగల్లీ, జామా మసీదు ఉర్దూ మీడియం భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించకపోవడం సరికాదన్నారు. పాఠశాలలో 120మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హన్మాండ్లు, నయీమ్, గౌస్, శేఖర్, ఫారూమ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తరలించొద్దు

బోధన్‌రూరల్,జనవరి18(ఆంధ్రజ్యోతి): నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని బోధన్ పట్టణం నుండి మరో చోటుకు తరలించొద్దని నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నాయకులు శనివారం ఫ్యాక్టరీ గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఎంతో చారిత్రాత్మకమైందని ఇలాంటి ఫ్యాక్టరీని మరో చోటుకు తరలిస్తారన్న పుకార్లు వస్తున్నాయన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తీసుకురావాలని బోధన్ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రవి శంకర్ గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు, దేవిదాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


గేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

తెలుగు ప్రజల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన కృషి మరువలేనిది


బోధన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


నగరంలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


నందిపేటలో..

బోధన్‌రూరల్,జనవరి18(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేసిన కృషి మరువలేనిదని ఎన్‌టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో అయ్యప్ప కమాన్ ఎదురుగా ఉన్న బొప్ప శ్రీను హాల్‌లో తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదానంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు, పట్టణ ప్రముఖులు , ప్రజలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత నందమూరి తారక రామారావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా జాడిజమాల్‌పూర్, ఏరాజ్‌పల్లి, పెంటాఖుర్దు తదితర గ్రామాల్లోని ఎన్‌టీఆర్ విగ్రహాలకు ఎన్‌టీఆర్ అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బోధన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరానికి ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు, యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి, ఎన్‌టీఆర్ అభిమాన సంఘం ఉపాధ్యక్షుడు సాంబిరెడ్డి, కోట గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పీ.గాంధీ, సంయుక్త కార్యదర్శులు ఏశాల రవీందర్, కృష్ణారెడ్డి, కోశాధికారి కృష్ణ మోహన్, కార్యవర్గ సభ్యులు సాంబశివరావు, పాండురంగారెడ్డి, బాల్‌రెడ్డి, జీవన్ రెడ్డి, బాలస్వామి, సూరిబాబు, రావెళ్ల శ్రీనివాస్, రామారావు, సుధాకర్, పావులూరి వెంకటేశ్వర్ రావు, ఆదినారాయణ, ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు, యువత, ప్రజలు, పట్టణ ప్రముఖులు అధిక సంఖ్య పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని ధర్మారం(బి)లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సేవలను కొనియడారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్ రెడ్డి, బీజేపీ నాయకులు రావుల బ్రహ్మనందం, రావుల శ్రీనివాస్, శివ, అబ్బులు, సురేశ్ పాల్గొన్నారు.

సుభాష్‌నగర్:తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నిజామాబాద్ పార్లమెంట్ కన్వీనర్ దేగం యాదాగౌడ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అర్బన్ హడహక్ కమిటీ సభ్యులు అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో దుబ్బ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేశారని పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి పార్టీ టీడీపీ పార్టీ అని అన్నారు. తెలు గుదేశం పార్టీ ఆవిర్భావంతోనే తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి బాట పడ్డాయ న్నారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్, కల్లెడ గంగాధర్, దంతాల ఆనంద్, రాజు, గోవర్ధన్‌గౌడ్, శంకర్, లవంగరాజు, గడ్డం ప్రభాకర్, మల్లారెడ్డి, యూసుఫ్, పాల్గొన్నారు.

సిరికొండ: మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నంద మూరి తారక రామరావు, మాజీ మంత్రి దివంగత ఏలేటి మహిపాల్‌రెడ్డిల వర్ధంతి సందర్భంగా సిరికొండలో అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహిపాల్‌రెడ్డి విగ్రహానికి,ఎన్టీఆర్ చిత్రపటానికి సల్లా రాజరెడ్డి, సదానంద్,గంగారెడ్డి, రాములు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బూస దేవరాజ్, సురేష్, ముషీర్,దేవేందర్, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు 29వ వర్ధంతిని శనివారం ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మిర్జాపూర్ కాలనీలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీని స్థాపించి తెలుగు ప్రజలకు ఎన్‌టీఆర్ ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, శ్రీధర్, శ్రీనివాస్, రాంబాబు, పత్తి లక్ష్మణ్, ఉదయ్ భాస్కర్, సిరాజ్, కొట్టం మనోహర్ పాల్గొన్నారు.

నవీపేట: తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను మండలంలోని కమలాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, శ్రీనివాస్ రావు, ఉమా మహేశ్వర్ రావు, వెంకట్ రాంరెడ్డి, యాదయ్య, బాబు, కిష్టయ్య, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ని:వర్నిమండల కేంద్రంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. ఏపీ ముఖ్యమంత్రిగా ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో దొరబాబు, సాయిబాబా,రాజు,చౌదరి పాల్గొన్నారు.

మెండోర: మెండోర మండల కేంద్రంలో ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోపిడి రాజన్న, టీడీపీ మండల అధ్యక్షుడు ముస్కు సురేష్‌లు పూలమాలల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ పేదలకు రూ.2లకే కిలో బియ్యం ప్రవేశపెట్టారని, పెన్షన్ విధానం ప్రవేశపెట్టారని, మహిళలకు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మండలాలు, సర్పంచ్ రిజర్వేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్‌టీఆర్ అభిమానులు నూదుల లింబాద్రి, అల్లూరి ముత్యంరెడ్డి, కొప్పెల ముత్యం, గోపిడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట:మండల కేంద్రంలో శనివారం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా ఆర్మూర్ బైపాస్ రోడ్డులో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించినినాదాలు చేశా రు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి పనులు, పథకాల గురించి వివరించారు. అనంతరం స్వీట్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు దంతాల ఆనంద్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, ఆమంద్ మల్లేష్, సాయిబాబ, కొండూర్ దేవిదాస్, శేఖర్, క్రాంతి కుమార్, శ్రీను, బాబన్న, రాజన్న, సాయిలు, నరేష్ తదితరులు ఉన్నారు.


మెండోరలో ..


వర్నిలో నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు


కమలాపూర్‌లో ..

మాజీమంత్రి మహిపాల్‌రెడ్డికి ఘన నివాళులు

ఆర్మూర్‌రూరల్, జనవరి18(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో మాజీమంత్రి మహిపాల్‌రెడ్డికి బీజేపీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. శనివారం పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో మాజీఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, బీజేపీ నాయకులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వర్గీయ మహిపాల్‌రెడ్డి తన నిస్వార్థ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మహిపాల్‌రెడ్డి ఆశయాలను ప్రోత్సహిస్తామన్నారు. తాము రాజకీయాలకు దూరం కాలేదని, నిరంతరం ప్రజలకు సేవ చేస్తూ ఉంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● స్వర్గీయ మహిపాల్‌రెడ్డి సేవలు మరువలేనివి

మాజీ మంత్రి స్వర్గీయ మహిపాల్‌రెడ్డి సేవలు మరువలేనివని వేల్పూర్, జక్రాన్‌పల్లి మాజీఎంపీపీలు మోతె రామాగౌడ్, కె.అనంత్‌రెడ్డిలు అన్నారు. శనివారం ఆర్మూర్‌లో మహిపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిపాల్‌రెడ్డి తన నిస్వార్థ సేవలతో ఎందరో రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లిమహిపాల్, సరితమోహన్, పాల్గొన్నారు.

ముప్కాల్:బాల్కొండ మండల కేంద్రంలో ఏలేటిమహిపాల్‌రెడ్డి 34వ వర్ధంతిని శనివారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా బాల్కొండ లోని మహతీ ఆశ్రమంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ముప్కాల్ మండల కేంద్రంలోని ఇటుక బట్టీల వద్ద కూలీలకు బీజేపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ మాజీ మంత్రి స్వర్గీయ ఏలేటి మహిపాల్ రెడ్డి 34వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సతీమణి ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, కుమారులు బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి స్వగ్రామం చౌట్‌పల్లి శివారులోని ఆయన సమాధి వద్ద జ్యోతి వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొని నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. మహిపాల్ రెడ్డి మరణించి 33 సంవత్సరాలుగడుస్తున్నా కార్యకర్తలు తమ కుటుంబ సభ్యుల మాదిరి నాటినుంచి నేటివరకు వెన్నటే ఉంటూ తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి .జివి నర్సింహారెడ్డి, బాల్కొండ అసెంబ్లి కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మలశ్రీనివాస్, భజరంగ్, మల్లేష్ యాదవ్, కొమ్ముల సంతోష్ కుంట భూమారెడ్డి, బద్దం రమేష్ రాజు, రాజన, చింత ప్రవీన్, రెండు నియోజకవర్గాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


చౌట్‌పల్లిలో మహిపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తు అన్నపూర్ణమ్మ కుటుంబసభ్యులు

మోపాల్‌లో మహిళ దారుణ హత్య

● ఆరు నెలల తర్వాత బయటపడిన వైనం ● చిట్టి డబ్బులు అడిగినందుకే హత్య?
● విచారణలో పోలీసు ఉన్నతాధికారులు

మోపాల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను హత్య చేసిన ఆరు నెలల తర్వాత బయటపడిన సంఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. మోపాల్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్న జంగం విజయ (45)ను అదే గ్రామానికి చెందిన బుచ్చన్న, అతడి జీతగాడు నగేష్‌లు కలిసి హత్య చేసి పూడ్చిపెట్టారని గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ హత్య సంఘటన శనివారం బయటపడటంతో ఏసీపీ, సీఐ, ఎస్సైల సమక్షంలో ఎక్కడ పాతి పెట్టారో అక్కడ ప్రొక్లెయినర్ సహాయంతో బయటకు తీశారు. హత్య చేసి ఆరు నెలలు కావడంతో శవమంతా కుళ్లిపోయి బొక్కలు మాత్రమే బయటపడ్డాయి. ఈ సంఘటన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చన్న గత కొద్ది సంవత్సరాల నుంచి చిట్టీలను నడుపుతున్నాడు. అతడి వద్ద జంగం విజయ చిట్టీలు వేసిందని ఆ డబ్బులు అడిగే సరికి బుచ్చన్నకు విజయ మధ్య గొడవ జరిగిందని గ్రామస్తులు చర్చించుకుం టున్నారు. విజయ తన చిట్టీ డబ్బులు అడగడంతో ఆమెపై బుచ్చన్న కోపాన్ని పెంచుకొని పథకం ప్రకారంగా విజయకు గత ఆరు నెలల క్రితం కల్లు తాగించి అతడి జీతగాడి సహాయంతో విజయను హత్య చేసి గ్రామ శివారులో పూడ్చిపెట్టాడు. ఇదిలా ఉండగా విజయ భర్త విజయ్ గత కొన్ని సంవత్సరాల నుంచి దుబాయ్‌లో ఉంటున్నాడు. ఆయన పంపించిన డబ్బులను ఏం చేసేదో ఎవరికి చెప్పేది కాదని గ్రామస్తులు పేర్కొన్నారు. అసలు విషయాన్ని తెలుసుకున్న భర్త కూడా దుబాయ్ నుంచి గత నాలుగు సంవత్సరాల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. పంపిన డబ్బులు భార్యను అడిగే సరికి సమాధానం ఇవ్వకపోవడంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగి కొంత కాలం దూరంగా ఉన్నారు. భార్యభర్తలకు మాటలు అంతంత మాత్రమే ఉన్నా యని గ్రామస్తులు తెలిపారు. ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకునేవారు కాదు. బంధువులను కూడా అడిగేవారు కాదు. ఇందులో భాగం గానే ఆరు నెలల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన విజయ ఇంటికి రాలేదు. అక్క మా ఇంటికి రాలేదని విజయ చెల్లెలు వారి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని ఇచ్చారు. విజయ కుమారుడు మనోహర్ గత రెండు రోజుల క్రితం తల్లి కనిపించడం లేదని మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటికే తన తల్లిని హత్య చేసింది ఎవరో పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి నింది తులను అదుపు లోకి తీసుకొని ఎక్కడైతే పాతి పెట్టారో తెలుసుకొని ప్రొక్లెయినర్ సహాయం తో శవాన్ని బయటకు తీశారు. సంఘటన స్థలం వద్దనే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై యాద గిరి తెలిపారు.


ప్రొక్లెయినర్ సహాయంతో శవాన్ని బయటకు తీస్తున్న దృశ్యం, విజయ(ఫైల్)

రేషన్ కార్డుల సర్వేను సక్రమంగా నిర్వహించాలి

రుద్రూరు,జనవరి18(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల సర్వేను సక్రమంగా నిర్వహించకుండా, ఇష్టారీతిగా నిర్వహిస్తున్నారని గ్రామస్థులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. రుద్రూరు మండలంలోని సులేమాన్ నగర్ గ్రామంలో రేషన్ కార్డుల సర్వేలో సొంత గ్రామంలో నివసిస్తున్న వారి పేర్లు రేషన్ కార్డుల సర్వే లిస్టులో రాకుండా, మహరాష్ట్ర, ఇతర ప్రాంతాల నుండి వచ్చి నివసిస్తున్న వారి పేర్లు సర్వే లిస్టులో ఉన్నాయని శనివారం గ్రామస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేశాఉ. గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వేను తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, రేషన్ కార్డులు లేని, అర్హులైన నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని గ్రామస్థులు అధికారులను కోరారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు

కమ్మర్‌పల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మం డల కేంద్రంలో స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్ ఉప్లూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రాజన్న, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఏ రాజేశ్వర్ గౌడ్, వ్యవహరించగా పరీక్ష కేంద్రాన్ని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు.

నందిపేట వైన్స్‌లో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

నందిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఆర్మూర్ బైపాస్ రోడ్డులో గల శ్రీరాజరాజేశ్వర వైన్స్‌లో శనివారం ఎక్సైజ్ అధికా రులు తనిఖీలు చేపట్టారు. కల్తీ మద్యం అమ్ముతున్నట్లు ఆరోపణలు రావడంతో నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ దిలీప్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. బ్లెండర్‌స్ప్రైడ్ రకానికి చెందిన 375 మిల్లీ లీటర్ల మద్యం ఉన్న బాటిళ్లను పరిశీలించారు. అందులో ఎటువంటి డిలుషన్ (పలుచగా) లేదని అధికారులు తేల్చారు. అయినప్పటికి బ్లెండర్‌స్ప్రైడ్ రకానికి చెందిన రెండు 375 మి.లీ సామర్థ్యం ఉన్న బాటిళ్లను రసాయన పరీక్షల నిమిత్తం సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ, సిబ్బంది ఉన్నారు.

బాసరలో నిజామాబాద్ జిల్లా యువకుడి ఆత్మహత్యాయత్నం

ముథోల్,జనవరి 18 (ఆం ధ్రజ్యోతి):నిర్మల్ జిల్లా బాసర పోలీసులు గోదావరి నది వద్ద ఆత్మహత్య చేసుకోవడా నికి వచ్చిన ఎందరినో గుర్తిం చి వారి ప్రాణాలను కాపాడ టంతో పోలీస్ శాఖ ఉన్నతా ధికారులతో పాటు ఇతరులతో కూడా ప్రశంసలుపొందారు. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు బాసర బ్రిడ్జిపై 24/7పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. తాజాగా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ విఠల్ సంతోష్ అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది తన ఆటోలోనే బాసర బ్రిడ్జికి చేరుకున్నాడు. స్నాన ఘట్టాల వద్ద ఆటోలోనే కూర్చుని సూసైడ్ నోట్ రాసుకుంటుండగా గమనించిన బ్లూకోర్ట్ పోలీస్ సిబ్బంది ప్రమోద్, గగన్ సూసైడ్ నోట్‌ను స్వాధీన పరుచుకొని బాసర ఎస్సై గణేష్‌కు సమాచారం అందించారు.అతనికి కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. అనంతరం బాధితుడిని కుటుంబ సభ్యుల కు అప్పగిం చారు. దీంతో బాసర ఎస్సైతో పాటు బ్లూకోర్ట్ పోలీస్ సిబ్బంది ప్రమోద్, గగన్, తదితరులను జిల్లా ఎస్పీజానకి షర్మిల, ఏఎస్పీ, ముథోల్ సీఐ మల్లేష్‌లు అభినందించారు.

చందూర్ మండల గ్రామ సభల తేదీలు ఖరారు

మోస్రా,జనవరి18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లుల విషయాలు ప్రజల వద్దకు చేరవేసేందుకు చందూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల వారిగా గ్రామసభల తేదీలు మండల ఎంపీడీవో నీలావతి ఖరారు చేశారు. 21న కారేగావ్ తండా, ఘన్‌పూర్, 22న లక్ష్మాపూర్, 23న మేడిపల్లి గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,జనవరి18(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌కు సన్మానం


జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డికి సన్మానం

నందిపేట,జనవరి18(ఆంధ్రజ్యోతి):జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా పదవి బాధ్య తలు చేపట్టిన పల్లె గంగారెడ్డిని నందిపేట, డొంకేశ్వర్ మండలా లకు చెందిన బీజేపీ నాయకులు సన్మానించారు.శనివారం ఆర్మూర్ మండలంలోని అంకా పూర్ లో గల ఆయన నివాసంలో మ ర్యాద పూర్వకంగా కలిశారు. జా తీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైనందుకు పల్లె గం గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో దాత్రికరాజు, నాగతారక,కుమ్మరిసురేందర్, గం గాధర్, గంగాగౌడ్ ఉ న్నారు.

డొంకేశ్వర్: జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా ఎన్నికైన శుభసందర్భంగా పల్లె గంగారెడ్డిని ఆయననివాసంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పోతుగంటి సురేందర్, మాజీ ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాదర్,కొండూర్ మాజీఎంపీటీసీ రాజు,గంగాగౌడ్, నగతరక్‌లు ఆయన నివాసం కలిసి శాలువ, పూలమాలతోసన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎక్స్‌రే కోసం బయట స్ట్రెచర్‌పై ఉన్న వ్యక్తి (ఇన్‌సెట్‌లో) కరెంటు లేక చీకటిగా ఉన్న గది

పెద్దాస్పత్రిలో రోగుల కష్టాలు

● కరెంటు లేక ఎక్స్‌రే, సిటీ స్కానింగ్ కోసం గంటల తరబడి ఎదురు చూపులు

సుభాష్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కరెంటు లేకపోవడంతో రోగులు కష్టాలు పడ్డారు. శనివారం విద్యుత్ శాఖ మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సైతం విద్యుత్ సరపరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు నుంచి మూడు గంటలు విద్యుత్ సర ఫరాకు అంతరాయం ఏర్పడటంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎక్స్‌రే, స్కానింగ్ పరికరాలు పని చేయలేదు. దీంతో ఎక్స్‌రే, స్కానింగ్‌కు వచ్చిన రోగులు ఇబ్బంది పడ్డారు. గంటల తరబడి స్కానింగ్‌ల కోసం, ఎక్స్‌రేల కోసం ఎదురు చూశారు. జిల్లా ఆసుపత్రిలో జనరేటర్ సదుపాయం ఉన్న ఎక్స్‌రే, స్కానింగ్‌లు పనిచేయకపోవడంతో వీటి కోసం వచ్చిన వారు గంటల తరబడి కరెంటు కోసం ఎదురు చూశారు. కోటగిరి నుంచి వచ్చిన రోగి మధ్యాహ్నం సమయంలో స్కానింగ్ కోసం వచ్చి గది బయ ట సుమారు రెండు నుంచి మూడు గంటల పాటు వేచి చూశాడు. అత్యవసర వార్డులో కొందరు రోగులు సిటీ స్కానింగ్ కోసం ఇబ్బందులు పడ్డారు. డాక్టర్లు సిటీ స్కానింగ్ తెచ్చుకోవాలని సూచించిన కరెంటు లేకపోవడంతో సిటీ స్కానింగ్ పనిచేయకపోవడంతో సాయంత్రం వరకు ఎదురు చూపులే దిక్కయ్యాయి. దీనిపై నూతనంగా నియామకమైన సూపరింటెండెంట్ దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయల సాగు.. బహు బాగు!

● డొంకేశ్వర్‌లో ఆదర్శంగా నిలుస్తున్న యువ రైతు

కృషి



రైతు సాగు చేసిన టమాట పంట



రైతు సాగు చేసిన పాలకూర పంట



రైతు సాగు చేసిన వివిధ రకాల కూరగాయలు

డొంకేశ్వర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తూ అధిక ఆదాయం పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఓ యువరైతు. కాలానుగుణంగా డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తూ లాభాలను అర్జిస్తున్నారు. వివిధ పంటలు కూరగాయల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. డొంకేశ్వర్, నూత్‌పల్లి, నడ్కుడ, నికాల్‌పూర్ గ్రామాల రైతులు అధికంగా కూరగాయలను సాగు చేస్తూ వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంట మార్పిడిపై అవగాహన కల్పించడంతో రైతులు నూతన పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన నూతికాడి రాజారెడ్డి గతంలో మొక్కజొన్న, సోయా పంటలకు సాగుచేసి నష్టపోయారు. రెండేళ్ల నుంచి కూరగాయల సాగు చేపట్టారు. టమాట, కాకర, బెండ, బీర, మెంతికూర, పాలకూర కూరగాయలను ఒక ఎకరం సాగు చేశారు. టమాటలకు అధిక రేటు ఉంటుందని ఎక్కువ మొత్తంలో సాగు చేశాడు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటకు ధర తక్కువగా ఉండడంతో లాభాలు తక్కువగా వస్తున్నాయని ఏడాదికి రెండు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు. అన్ని సీజన్‌లలో కూరగాయలు సాగు అవుతుండడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టమాట వంకాయ, కాకరకాయ, పాలకూర, కొత్తిమీర సాగుచేసి డొంకేశ్వర్ సంతతో పాటు వివిధ గ్రామాల ప్రజలకు విక్రయిస్తున్నారు. కూరగాయల సాగుతో కష్టపడి పనిచేస్తున్నందున ఫలితం దక్కుతుందని రైతు తెలిపారు.

కూరగాయల సాగు బాగుంది

● నూతికాడి రాజారెడ్డి, రైతు, సిర్పూర్



కాలానికి అనుగుణంగా డిమాండ్‌కు తగ్గట్టు కూరగాయలను సాగు చేస్తున్న మంచి ఆదాయం వస్తుంది. ఎకరం భూమిలో వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తూ పండిన కూరగాయలను గ్రామాల్లో గురువారం జరిగే సంతలు విక్రయిస్తారు. టమాటకు రేటు తక్కువగా ఉండడంతో లాభాలు తక్కువగా వస్తున్నాయి. కూరగాయల విత్తనాలపై ప్రభుత్వం సబ్సిడీ అందించాలి

ఖేలో భారత్ ఉత్సవాలను
ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే



ఖేలో భారత్ ఉత్సవాలను క్రికెట్ ఆడి ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతిల సందర్భంగా అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహిం చిన ఖేలో భారత్ ఉత్సవాలను శనివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, శారీరక, మానసిక ధృడత్వం పెంపొందించే విధంగా మహనీయుల జయంతి సందర్భంగా ఖేలో భారత్ పేరుతో విద్యార్థి పరిషత్ క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత పదేళ్ల నుంచి క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని ఖేలో ఇండియా పేరుతో ఎంతో మంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులకు మౌలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఇందూర్ ప్రముఖ్ రెంజర్ల నరేష్, విభాగ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ రాజ్‌సాగర్, విభాగ్ కన్వీనర్ శశి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన దృశ్యం



దెబ్బతిన్న సిరికొండ బైపాస్ రోడ్డు

ఆంధ్రజ్యోతి పరిశీలన

సిరికొండ బైపాస్ రోడ్డు బాగుపడేదెన్నడో..!?

● శంకుస్థాపన చేసి15 నెలలు గడిచినా పనులు నేటికి ప్రారంభం కాకపోవడంతో ప్రజల ఇబ్బందులు

సిరికొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న సిరికొండ బైపాస్ రోడ్డు బాగుపడేదెన్నడోనని సిరికొండ గ్రామస్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. సిరికొండ పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి ప్రతిభ పాఠశాల వరకు దెబ్బతిన్న సిమెంటు రోడ్డు స్థానంలో తారు రోడ్డు నిర్మాణానికి 2022-23లో ఎఫ్‌డీఆర్‌లో రూ.50 లక్షలు ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. 2023 సెప్టెంబరు నెలలోనే పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు టెండరు పనులను పూర్తి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అప్పట్లోనే ఆనాటి ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ శంకుస్థాపన చేసి పదిహేను నెలలు గడిచిపోయినా రోడ్డు పనులు మాత్రం నేటికి ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై నిజామాబాద్ వెళ్లడానికి సిరికొండ గ్రామంలో నుంచి కాకుండా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా వెళ్లడానికి చాలా సులువైన మార్గ మని ప్రజలు భావిస్తున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే కొండూర్, ధర్పల్లి, వాల్గోట్ వెళ్లే ప్రయాణికులు ప్రయాణించడానికి వీలుగా ఉంటుంది. మండలంలోని మైలారం, సిరికొండ, చీమన్‌పల్లి, పందిమడుగు, రావుట్ల, న్యావనంది తదితర గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ప్రయాణం చేస్తారు. పై గ్రామాల ప్రజలకు ఉపయోగపడే రోడ్డు పనులు ప్రారం భించడానికి అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు గ్రామంలో నుంచి కాకుండా బైపాస్ రోడ్డుపై నుంచి ప్రయాణిస్తారు. గ్రామంలో ట్రాపిక్ ఇబ్బందులు ఉండవు, సిరికొండ ప్రజలకు వాహనాలతో ఎలాంటి ఇబ్బందులు ఉండవు 2014 కంటే ముందు మట్టి రోడ్డుగా ఉన్న బైపాస్ రోడ్డును ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం సిమెంటు రోడ్డుగా నిర్మించిన ప్పటికీ రానురాను సిమెంటు రోడ్డంతా ధ్వంసమైంది. రోడ్డు ధ్వంసం కావడం వల్ల వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా లారీలు, ద్విచక్ర వాహనదారులు పడే ఇబ్బందులు అనేకం. డ్రైవర్లు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు ప్రయాణికుల పాలిట ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళలో వెళ్లే వాహనదారులు అనేక సందర్భాల్లో పడిపోయారు. పలువురికి దెబ్బలు కూడా తగిలినట్లు చెప్పుకుంటారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి స్పందించి వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పనులు త్వరలో ప్రారంభమవుతాయి

● డీఈఈ అహ్మద్ హస్సేన్

పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఈ రోడ్డు విషయం ప్రశ్నిస్తే త్వరలో పనులు ప్రారంభమవుతాయని డీఈఈ అహ్మద్ హస్సేన్ తెలిపారు. సిరికొండ వైకుంఠధామం పక్క నుంచి కామారెడ్డి ఆర్‌అండ్‌బీ రోడ్డును కలు పుతూ నూతన రోడ్డు నిర్మాణానికి కోటి అరవై లక్షల రూపాయలు మంజూర య్యాయని ఆయన చెప్పారు. ఈ పనులకు టెండర్లు పిలిచారని, టెండరు ప్రాసెస్ పూర్తి కాగానే రెండు పనులను ఒకేసారి డబుల్ రోడ్డుగా మారుస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు లక్ష్యం 10లక్షలు



ధర్మారంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డిచ్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం సభ్యత్వ నమోదు 10లక్షలు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని ఇప్పటికే 1లక్షల వరకు నమోదును పూర్తి చేశామని జిల్లా టీడీపీ అధ్యక్షుడు యాదాగౌడ్ పేర్కొన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కోసం తమ వద్దకు తరలివస్తున్నారని అన్నారు. సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనేందుకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేనివారు సభ్యత్వం చేసుకునేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎన్టీఆర్ ట్రస్ట్‌లో అనాథలైన వారికి విద్యాబోధన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయుడు ఆంజనేయులు, వసంత్‌రావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

జానకంపేట పర్మిట్ రూంలో
ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



పర్మిట్ రూం వంట గదిని పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసురాం

ఎడపల్లి, జనవరి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామంలో గల విజయదుర్గ వైన్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పర్మిట్ రూంలో కుళ్లిన పదార్థాలను విక్రయిస్తున్నారని గ్రామానికి చెందిన పాపాయి నాగేష్ శుక్రవారం రాత్రి ఫుడ్ సేఫ్టీ అధికారులకు చరవాణిలో ఫిర్యాదు చేయగా, శనివారం ఉదయం ఫుడ్ ఇన్స్‌పెక్టర్ వాసురాం తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా 3500 రూపాయల విలువచేసే పగిలిన కోడిగుడ్లను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. ఆహార పదార్థాల్లో వినియోగించే రంగు డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. పర్మిట్ రూంలో వండి వినియోగదారులకు అందిస్తున్న పలు రకాల వంటకాల శాంపిల్‌లను సేకరించారు. అనంతరం ఫుడ్ ఇన్స్‌పెక్టర్ వాసురాం మాట్లాడుతూ పర్మిట్ రూం వంటగదిలో శుభ్రత లేదని శుభ్రత పాటించాలని, నిర్వాహకులు సైతం వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు.

● పర్మిట్ రూం నిర్వాహకులతో అధికారుల కుమ్మక్కు

జానకంపేట గ్రామంలో గల విజయదుర్గ వైన్స్ పర్మిట్ రూంలో శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన పాపాయి నాగేష్ మద్యం సేవించడానికి వెళ్లి ఆహార పదార్థం అడగగా కుళ్లిన ఆహార పదార్థం ఇవ్వడంతో ఇది కుళ్లిందని వేరేది మార్చి ఇవ్వమని అడగగా నిర్వాహకులు అతనిపై దురుసుగా ప్రవర్తించడంతో బాధితుడు బోధన్ ఎక్సైజ్ అధికారులకు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులకు చరవాణిలో ఫిర్యాదు చేశాడు. శనివారం ఉదయం ఫుడ్‌సేఫ్టీ అదికారులు తనిఖీకి రావడంతో ముందుగా సమాచారం అందుకున్న పర్మిట్ రూం నిర్వాహకులు అధికారులు వచ్చే సమయానికి తాజా మాంసం, ఆహార పదార్థాలు తీసుకువచ్చి అక్కడ ఉంచి అధికారిని తప్పుదోవ పట్టించాడని బాదితుడు ఆరోపించాడు. అనుమతి లేకున్నా బార్‌ను తలపించే విధంగా పర్మిట్ రూం నడుపుతూ ప్రజల ఆరోగ్యాలతో పర్మిట్‌రూం నిర్వాహకులు చెలగాటం ఆడుతున్నారని వీరికి అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి పర్మిట్‌రూం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో
విజయ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న అమృతలత

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లో ఇటీవల జరిగిన నాల్గవ ఇన్‌స్పైర్ కప్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో జిల్లా కేంద్రంలోని విజయ్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సీహెచ్ జాహ్నవి యాదవ్ పెన్నా జట్టులో తమిళనాడుతో తలపడి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు నగదు బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని శనివారం పాఠశాల వ్యవ స్థాప కురాలు అమృతలత అభినందించారు. అదేవిధంగా ఖేలో ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయి పోటీలో విజయ్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న హర్ని యాదవ్ అండర్-13 బాలికల విభాగంలో పాల్గొని బెస్ట్ డిఫెండల్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును గెలుచుకోగా ఆమెను అభినందించారు.

విద్యార్థులను అభినందించిన డీఈవో



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొంది దక్షిణ భారత స్థాయికి ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్లను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అభినందించారు. జిల్లా నుంచి ఇన్‌స్పైర్‌లో ఒక ప్రాజెక్టు, సైన్స్ ఎగ్జిబి షన్‌లో నాలుగు ప్రాజెక్టులు ఎంపిక కాగా ఈనెల 21 నుంచి 25 వరకు సౌత్ ఇండియా స్థాయి పోటీలు పాండిచ్చేరిలో జరుగనున్నందున అక్కడ ఉత్తమ ప్రదర్శన ఇచ్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, ఏసీ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన అలనాటి మధుర గీతాలు



మాట్లాడుతున్న వక్త

నిజామాబాద్ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నాటి గాయనీ గాయకులు ప్రేక్షకులను అలరించిన మధుర గీతాలతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యాంతం శ్రవనానందకరంగా సాగింది. శనివారం జిల్లా కేంద్రంలోని స్వర సౌరభం సంగీత కళాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై ప్రారంభించారు. గంటసాలా, బాలసుబ్రహ్మణ్యం, రామకృష్ణ, సుశీల, తదితరులు పాడిన అలనాటి పాటలను గాయకులు ఆలపించిన పాటలతో ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ నాటి పాటలను గుర్తు తెచ్చుకునే విధంగా ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సంగీత సాహిత్యాలతో అప్పటి సినీ గీతాలు చక్కగా ఉండేవని నేటి గీతాలలో సాహిత్యం, సంగీతం రెండూ కూడా ఆధునికత సంతరించుకుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సంస్థ మరిన్ని నిర్వహించాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ శిరీష రాఘవేందర్ మాట్లాడుతూ ఎన్నో రోగాలు సంగీతం ద్వారానే నయమవుతున్నా యని శాస్త్రీయ సంగీత సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఎన్నో రోగాల నుంచి విముక్తి పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి వీపీ చందన్‌రావు అధ్య క్షత వహించగా ఆత్మీయ అతిథులుగా రాజ్ కుమార్ సుబేదార్, బాజిరెడ్డి జగన్, మురళి, తబలా కళాకారిణి పాయల్ కోటగిరికర్, సముద్రాల రాములు, అన్నపూర్ణ, ఆయాచితం నాగరాజశర్మ, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారిని కొండపై చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయం

● రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి ● డిచ్‌పల్లిలో నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



డిచ్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కారు రేసింగ్ అవకతవకలలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ త్వరలో జైలుకు వెళ్లడం ఖాయమని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి జోస్యం చెప్పారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఇందిరమ్మ నమూన ఇళ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీల పేరుతో రాజకీయం చేస్తున్న కవిత గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీసీలు ఎందుకు గుర్తు రాలేదని విమర్శించారు. ధైర్యం ఉంటే కవితతో పాటు వారి కుటుంబ సభ్యులు అనుభవిస్తున్న పదవులు బీసీ నాయకులకు కేటాయించాలని సూచించారు. భారత దేశ రాజ్యాంగం ఏర్పాటై 75 ఏళ్ల సందర్భంగా జనవరి 26న రాష్ట్ర ప్రజలకు తీపు కబురుగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. రానున్న 4ఏళ్లలో రూరల్ నియోజకవర్గంలో 20వేల ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాస్తేనే కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని కార్యాలయం ప్రారంభానికి స్థానిక ఎమ్మెల్యేగా తనను ఆహ్వానించకపోవడం విడ్డూరమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, పెద్దోళ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పోస్టర్‌లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించబడుతున్న సాంఘిక సంక్షేమ గిరిజన, మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధారణ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు చేరాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన గురుకుల ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. గురుకులాల్లో నాణ్యమైన విద్య, మంచి భోజనం, హాస్టల్ సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి లత, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

'పేకాట'పై ఎస్పీ ఆరా

● నసురుల్లాబాద్ పోలీసుల తీరుపై సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నసురుల్లాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలో కొన సాగుతున్న పేకాటపై జిల్లా ఎస్పీ సింధూశర్మ స్పందించారు. నసురుల్లాబాద్ మండలంలోని అయా గ్రామాల్లో విచ్చలవిడిగా సాగుతున్న పేకాటపైన 'దర్జాగా పేకాట' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా ఎస్పీ వెంటనే స్పందించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసుల తీరుపై జిల్లా ఎస్పీ సీరియస్ అయినట్లు తెలిసింది. మండలంలోని వివిధ గ్రామాల్లో పేకాట రాయుళ్లు దర్జాగా పేకాట ఆడుతూ పోలీసులకు మామూళ్ళు ముట్టచెబుతుండటంతో మండలంలో పేకాట జోరుగా కొనసాగుతుంది. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై జిల్లా పోలీస్ బాస్ స్థానిక పోలీసులపై సీరియస్ కావడంతో మండలంలో పేకాట రాయుళ్లపై, పేకాట స్థావరాలపై ప్రత్యేక దృష్టిని సారించి మండలంలో పేకాట ఎక్కడ కూడా జరుగకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. కొందరు పోలీసులు పేకాటరాయుళ్లతో కుమ్మక్కై వారి నుంచి ముడుపులు తీసుకుంటూ, వారికి సహకరి స్తున్న పోలీసు సిబ్బందిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి



డీఎస్‌వోకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని 41 రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన రూ.417 కోట్ల విలువైన బియ్యాన్ని తమ సొంతానికి అమ్ముకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినియోగదారుల మండలి ప్రతినిధులు శనివారం జిల్లా పౌరసరఫరాల అధికారి అర్వింద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కస్టం మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు సకాలంలో ప్రభుత్వానికి ఇవ్వకుండా మోసం చేసినందున పౌరసరఫరాల అధికారులు రెవెన్యూ రికవరీ యాక్ట్‌తో పాటు ఆయా ప్రాంతాలలో పోలీస్ స్టేషన్‌లలో నమోదు చేసిన కేసుల్లో సెక్షన్ 403, 406, 409లు తప్పనిసరిగా నమోదు చేయాలని మిల్లర్లు కోర్టు ద్వారా తెచ్చుకున్న స్టేను వెకెట్ చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండవద్దన్నారు. నిజామాబాద్‌లో అక్రమ మిల్లర్లపై ఇప్పటికే సెంట్రల్ విజిలెన్స్ కమీషన్‌లో ఫిర్యాదు చేశామని కస్టం మిల్లింగ్ రికవరీలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం వల్ల కొందరు బడా మిల్లర్లు రాష్ట్రం, దేశం విడిచి పోతున్న క్రమంలో ప్రభుత్వ ధనం రికవరీలో సంబంధిత అధికారులే బాధ్యులు అవుతారని జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో కస్టం మిల్లింగ్ రైస్ అతిముఖ్యమైన భాగమైనందున అధికారులు వినియోగదారుల సంక్షేమం దృష్ట్యా సత్వర చర్యలు అవసరమని కోరారు. ఆయనతో పాటు సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, అనీల్‌కుమార్, ప్రవీణ్, వర్మ, శ్రీనివాస్, తదితరులు డీఎస్‌వోను కలిసిన వారిలో ఉన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



నగరంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి):సీపీఎం పార్టీ రాష్ట్ర నాల్గవ మహాసభల పోస్టర్లను సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ఆవిష్కరించారు. జిల్లా పార్టీ కార్యాలయం లో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25 నుంచి 28 వరకు మహాసభలు జరుగుతాయని అన్నారు. 25న ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని ఈ సభలో పొలిట్ బ్యూరో సభ్యుడు బృందా కారప్, బీవీ రాఘవ్‌లు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు విఘ్నేష్, వి.ఆనంద్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

21న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జిల్లా క్రీడా ఎంపికలు

సుభాష్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి పోటీల కోసం జిల్లా ఎంపికలు ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. నగరంలోని డీఎస్‌ఏ పాత కలెక్టరేట్ మైదానంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల వరకు డీఎస్‌ఏ మైదానంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. 14 క్రీడా అంశాలలో పోటీలు ఉంటాయన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లో వివిధ స్టేడియాలలో రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఖిల్లా,జనవరి18(ఆంధ్రజ్యోతి):నగర శివారులోని వెంగల్‌రావ్‌నగర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన జరిగింది. ప్రమాదవశాత్తు జరిగిన ఈ అగ్నిప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు.వెంగళ్‌రావ్‌నగర్‌కాలనీకి చెందిన ముస్తయిద్‌బేగం కుటుంబసభ్యులతో నిదిరిస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీం తో అప్రమత్తమైన ఆ కుటుంబం బయటకు పరుగులు పెట్టారు. సమాచారాన్ని అగ్నిమాపకశాఖాధికారులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్‌రావ్ తమ సిబ్బందితో మంటలను ఆర్పారు. ఈ ఘటనలో సుమారు 2లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని, ఎటు వంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారి తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటన స్థలానికి చేరుకోవడంతో పెద్దగా ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం జరుగలేదని ఆయన తెలిపారు. మంటలను ఆర్పడంలో సిబ్బంది ఏసురత్నం, సాయిలు, జయంత్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పట్టివేత సీజ్

ఇందల్వాయి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ధర్పల్లి అటవీ ప్రాంతంలో ఫారెస్టు అధికారుల అనుమతులు లేకుండా అడవిలో అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి రవిమోహన్‌భట్ శనివారం తెలిపారు. అడవి ప్రాంతంలో ఫారెస్టు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి అక్రమ రవాణా చేసినట్లయితే అట్టివారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, జనవరి18(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా ప్రతీ కార్యకర్త, నాయకులు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎడపల్లి మండలంలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటి అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలని అందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు గ్రామాల్లో ఎవరెవరికి అందాయో అందని వారికి ఎందుకు అందలేదో ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త తెలుసుకుని వాటిని ప్రజలకు వివరించాలని, అందని వారికి ఎందుకు అందలేదో వివరించాలని సూచించారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు బొబ్బిలి శ్రీనివాస్, సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రామోహన్, నాయకులు శంకర్ నాయుడు, ఎల్లయ్య యాదవ్, రజితా యాదవ్, బంజ కామప్ప, లింగం, విజయ్ కుమార్ గౌడ్, రాధా కిషన్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నవీపేట: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 12వేల రూపాయల చెల్లింపు, అర్హులైన వారందరికీ రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయలను కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు రాస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పలువురు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, సంగెం శ్రీనివాస్, భగవాన్, బాల్‌రాజ్ గౌడ్, మానికేశ్వర్ రావు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● ప్రజా సమస్యలను పరిష్కరించాలి

అధికారులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం నవీపేటలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఏవో నవీన్ కుమార్‌లతో మాట్లాడారు. రైతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

చిత్తశుద్ధితో వైద్యసేవలు అందించాలి

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



వైద్యులతో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలు అందించడంలో డాక్టర్లు చిత్త శుద్ధితో పనిచేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా వైద్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గంలో ఉన్న ఏడు ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు కావాల్సిన చికిత్సను అందించాలని సూచించారు. అర్బన్‌లో బస్తీ దవాఖానాల తీరుపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. డాక్టర్లు, సిబ్బంది ఉన్నప్పటికీ దవాఖానాకు వచ్చే రోగులను పట్టించుకోవడం లేదని మందులు ఇవ్వకుండా రికార్డులలో మాత్రం లెక్కలు అధికంగా ఉండటం తో మండిపడ్డారు. ఈ మధ్యకాలంలో ఓ బస్తీ దవాఖానా తనిఖీ చేసిన అంశాలను గుర్తు చేశారు. అటువంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైమరీ బస్తీ దవాఖానా సెంటర్ల డాక్టర్లు చిత్తశుద్ధితో ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. పేదలకు అందించాల్సిన వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పీహెచ్‌సీలో టాయిలెట్స్, మౌలిక సౌకర్యాల ఇబ్బంది ఉందని డీఎం హెచ్‌వో రాజశ్రీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల ను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, డీఎస్‌వో నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతీ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు.ఇతర అధికారిక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నందున ఈనెల 20వ తేదీ సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు. తిరిగి జనవరి 27వ తేదీ సోమ వారం నుంచి యథావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

20న ఉచిత కంప్యూటర్ శిక్షణ కోసం ఎంపికలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కొరకు ఈనెల 20న నగరంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు నిజామాబాద్ డైరెక్టర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ, యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తూ ఉచిత వసతి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు నెలల కాల వ్యవధి కలిగిన డొమాస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్‌తో పాటు బేసిక్ కంప్యూటర్, డాటా ఎంట్రీ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. 18 సంవత్సరాల నుంచి 30 ఏళ్లలోపు యువతీ యువకులు 10వ తరగతి పాసైన వారు ఈనెల 20న జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ లోగల ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలన్నారు. 10వ తరగతి, ఇంటర్ మెమోలతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్, రేషన్ కార్డుతో పాటు బ్యాంక్ పాస్‌బుక్, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో హాజరుకావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఇతర వివరాలకు 9014569553, 6309785035 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నల్లవెల్లిలో పెద్దమ్మ పండుగ

ఇందల్వాయి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లి పండుగ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటిరోజు శనివారం జెండా ఆవిష్కరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ పెద్దలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు అభినందనీయం



ఇందల్వాయిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

ఇందల్వాయి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు అభినందనీయమని జిల్లా పసుపు రైతుల కల నెరవేరిందని బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రి పీయూష్‌గోయల్, జిల్లా ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. సంక్రాంతి కానుకగా పసుపు బోర్డు జిల్లా ప్రజలకు అందించారని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం బీజేపీ పార్టీకే దక్కుతుందని అన్నారు.ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ,కుంటమోహన్‌రెడ్డి, నాయుడు రాజన్న, కేపీరెడ్డి, కన్నెచిన్ని, రాజేందర్, నీరడి జనార్ధన్, సవిత పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన కేసులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి

ఖిల్లా,జనవరి 18 (ఆంధ్రజ్యోతి):రైతులపై కేంద్ర ప్రభుత్వం పెట్టిన కేసులను రద్దు చేయాలని, ఇచ్చిన హామి మేరకు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఏఐకేఎంకేఎస్ వక్తలు డిమాండ్ చేశారు. నగర శివారులోని నర్సన్నకాలనీలో శనివారం జరిగిన మహాసభల్లో వక్తలు ప్రసంగించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి పార్లమెంటులో మెజార్టీ రైతులకు వ్యతిరేకంగా బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాల రైతులు ఢీల్లీలో మహాధర్నాను జరుపడం జరిగిందన్నారు. ఆ ధర్నా ను దృష్టిలో పెట్టుకుని మోడి ప్రభుత్వం దిగివచ్చి రైతు సంఘాల నాయకులతో చర్చలు జరిపి ఆ చట్టాలను వెనుకకు తీసుకుంటామని హామి ఇచ్చి ఇప్పటి వరకు దానిని అమలు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర నాయకులు కత్తులమారుతి, ప్రసాద్, పల్ల మల్లేష్, ఉప్పలయ్య, ఈర్లసైడి,బామండ్ల రవీందర్, పంచాల నర్సింహులు, రాపాకసత్యనారయణ, కొండ అనూష, రజియాబేగం, గారబోయిన శంకర్, మాటూరి కనకయ్య, అల్లె నరసింహులు, రైతుకూలీ సంఘం మహిళలు పాల్గొన్నారు.

‘క్రీడలతో శరీర దృఢత్వం పెరుగుతుంది’



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల

నిజామాబాద్ లీగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):పని విధానాలంలో పడి ఆట పాటలకు దూరమైన పరిస్థితుల బయటపడాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత కుంచాల అన్నారు. ఆటలతో శారీరక, మానసిక పునరుత్తేజానికి వీలు కలిగి శరీరదృఢత్వం చేకూరుతుందని ఆమె అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా న్యాయవాదులు, న్యాయమూర్తుల క్రీడా కార్యక్రమాలను పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఏదో ఒక పనిచేసి అలసిపోతాడని క్రీడలతో అలసటను శారీరక శ్రమను మరిచి నూతనోత్తేజాన్ని చేకూర్చుకుంటాడని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్, అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ న్యాయాధికారి హరికుమార్, బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కార్యదర్శి సురేష్, క్రీడల కార్యదర్శి పిల్లిశ్రీకాంత్, కోశాధికారి దీపక్, న్యాయవాదులు మానిక్‌రాజు, కవిత, విఘ్నేష్, పాల్గొన్నారు.

327 యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గంగాధర్

సుభాష్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ కంపెనీ ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ కంపెనీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన పుదారి గంగాధర్ ఎంపికయ్యారు. వరంగల్‌లో జరిగిన యూనియన్ ఎన్నికల్లో 17 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జిల్లాకు చెందిన సుధాకర్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



జక్రాన్‌పల్లిలో భూమిపూజ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి, జనవరి18(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్‌భూపతిరెడ్డి అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈనెల 26న సీఎంరేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించి అర్హులైన వారందరికి ఈ పథకాలు అందిస్తామన్నారు. నిజామాబాద్‌రూరల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు.ఇందులో జక్రాన్‌పల్లి మండలానికి 500ఇళ్లు మంజూరైనట్టు తెలిపారు. రూరల్ నియోజకవర్గ ప్రాంతంలో పేదప్రజలు చాలా మంది ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించి మరికొన్ని ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. గడిచిన పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తానని కట్టించలేదని ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ఆ పార్టీల నాయకుల మాటలు నమ్మవద్దన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో డాక్టర్ భూపతిరెడ్డి సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీడీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నిజామాబాద్‌రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరివినోద్, మండల ప్రధానకార్యదర్శి వసంత్‌రావు, సింగిల్‌విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్, మాజీసర్పంచ్‌లు ఎం.చిన్నసాయిరెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, బాలకిషన్, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మాజీ వైస్ఎంపీపీ జితేందర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

గ్రామ స్వాగత తోరణాన్ని ధ్వంసం చేసిన లారీ



ఖానాపూర్‌లో పొక్లెయినర్‌తో లారీని తొలగిస్తున్న దృశ్యం

మోపాల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ మండలంలోని ఖానాపూర్ గ్రామ స్వాగత తోరణాన్ని శుక్రవారం అర్ధరాత్రి భారీ ఎత్తున లారీ వెళ్లడంతో స్వాగత తోరణం ధ్వంసమైంది. దీంతో పక్కనున్న విద్యుత్ స్థంభం కూడా కిందపడిపోవడంతో గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో రైస్‌మిల్లులు ఎక్కువగా ఉండటంతో భారీ వాహనాలు ఎక్కువగా నడుపుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయా రైస్‌మిల్లుల యజమానులకు చెప్పినప్పటి కూడా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. భారీ ఎత్తైన వాహనాలు వెళ్లడంతో విద్యుత్ స్థంభాలు ధ్వంసం కావడంతో పాటు స్వాగత తోరణం కూడా ధ్వంసమైతున్నాయని మండి పడ్డారు. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు పొక్లెయినర్ సహాయంతో లారీని తొలగించారు. లారీ యజమానిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిరికొండ,జనవరి18 (ఆంధ్రజ్యోతి):ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా గమ్య స్థలానికి చేరుకోవాలని సిరికొండ ఎస్సైరామ్ ప్రజలు, ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సిరికొండ మండలం చీమన్‌పల్లి గ్రామంలో శనివారం స్థానిక యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామ్ మాట్లాడుతూ ప్రయాణికులు ముఖ్యంగా వాహన చోదకులు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ప్రమాదాలను నివారించడంలో వాహన చోదకులు ఖచ్చితంగా ట్రాఫిక్ నియామాలను పాటించి సహకరించాలని ఎస్సై రామ్ కోరారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు

సిరికొండ జనవరి 18 (ఆంధ్రజ్యోతి) పట్టుదలతో పాటు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు విద్యార్థులకు సూచించారు. సిరికొండలో జరిగిన కార్యక్రమంలో 2023-24లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మండలంలో టాపర్లుగా వచ్చిన విద్యార్థులకు రావుట్ల చిన్న నర్సయ్య స్మారకార్థం ప్రతి ఏడాది అందించే రూ.ఐదువేల నగదు పురస్కారాన్ని, మెమొంటోలను తహసీల్దార్ రవీందర్ రావు, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి,స్కౌట్స్ మరియు గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సాల్మన్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.260	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.81100	రూ.74800	రూ.955

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.10, 1.10, 4.10, 7.10, 10.10)
స్క్రీన్-2 : డాకు మహారాజ్ (10.20, 1.25, 7.35, 10.40)
: ఎమర్జెన్సీ (హిందీ) (4.30)
స్క్రీన్-3 : గేమ్ చేంజర్ (12.00, 3.20, 6.40)
: ఎమర్జెన్సీ (హిందీ) (10.00)
స్క్రీన్-4 : ఎమర్జెన్సీ (హిందీ) (12.00)
: ఆజాద్ (హిందీ) (3.05, 10.15)
: పుష్ప-2 (6.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.45, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-2 : గేమ్ చేంజర్ (1.10, 7.35, 10.35)
: డాకు మహారాజ్ (4.30)
స్క్రీన్-3: డాకు మహారాజ్ (11.00, 1.40, 7.35, 10.30)

దేవి: డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: గేమ్ చేంజర్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్